ప్రాణానికి ప్రాణం!

టెంపోరావ్

స్పెషల్ బ్రాంచి డైరక్టర్ విశ్వనాథ్ ఎదురుగా కూర్చున్న మనిషివైపు చూశాడు.

"మిస్టర్ బులెట్, ఇది చదవండి!" అన్నాడు విశ్వనాథ్.

అతడిచ్చిన పత్రాన్ని బులెట్ సీరియస్‌గా చదివాడు.

ఇద్దరు ఇండియన్ గూఢచారులు రగడాలో హత్య చేయబడ్డారు. పత్రాన్ని విశ్వనాథ్ వైపు తోసి బులెట్ అతనివంక వినయంగా చూశాడు.

"మిస్టర్ బులెట్! రగడా పెద్దదేశం కాదు. దాని ముఖ్యపట్నం రినోసిటీ. అన్నిదేశాల గూఢచారులూ ఆ పట్నంలో తిరుగుతూవుంటారు. అనేక రహస్య విషయాలు కనుక్కొని కోడ్‌లో వాళ్ళదేశాలకు అందజేస్తూ వుంటారు. మా గూఢచారులు మరో యిద్దరుమాత్రం అక్కడున్నారు. వాళ్ళనికూడా చంపుతారని నాకు భయంగా వుంది!"

విశ్వనాథ్ ఆగాడు. కేసులోంచి సిగరెట్ తీసి, బులెట్ కో సిగరెట్ యిచ్చి అతడు లైటర్ వెలిగించాడు. ఇద్దరూ సిగరెట్లు వెలిగించుకున్నారు.

"మిస్టర్ బులెట్, మీరు రినో పట్నానికి వెళ్ళాలి. అక్కడున్న మా గూఢచారుల్ని కల్సుకుని, వాళ్ళకు సహాయపడాలి."

"ఆల్ రైట్, వెళ్తాను," అన్నాడు బులెట్.

"మా తరఫున పనిచేసినంతకాలం మీరు BE 15 అనే కోడ్ నేమ్‌ను వాడండి. మీగురించి అక్కడున్న మా గూఢచారులకు మేం సందేశం పంపిస్తాం," అన్నాడు విశ్వనాథ్.

"గుడ్," అన్నాడు బులెట్.

విశ్వనాథ్, డ్రాయర్ సొరుగు లాగి రెండు ఫోటోలను తీసి అతడికిచ్చాడు.

"వాళ్ళ పేర్లు వెనక రాయబడ్డాయి. వాళ్ళుండే అడ్రసులు ఫోటో వెనక యిచ్చాం. ప్రస్తుత పరిస్థితుల్లో వాళ్ళు అక్కడ వుండకపోవచ్చు!"

"రినోసిటీలో ఎక్కడో అక్కడ వాళ్ళు నాకు కనిపిస్తారు. డోంట్ బాదర్," అన్నాడు బులెట్.

విశ్వనాథ్, అతడివంక సూటిగా చూశాడు.

"మిస్టర్ బులెట్, మీకు ప్లేన్ టికెట్ మరో రెండు గంటల్లో పంపుతాము. రినోలో హోటల్ హిమాలయాలో దిగండి. దాని ప్రొప్రయిటర్ రషీద్. మీకు ఎంత డబ్బు కావల్సినా అతడు యిస్తాడు. అతడికి నేను మీగురించి వార్త పంపుతాను," అన్నాడతను.

విశ్వనాథ్, బులెట్ కుర్చీల్లోంచి లేచి నిలబడ్డారు. బులెట్ తో, నవ్వుతూ, అతడు కరచాలనం చేశాడు.

"మిస్టర్ బులెట్, ఐ విష్ యు గుడ్ లక్!" అన్నాడు విశ్వనాథ్.

బులెట్ హుషారుగా బయటకు వెళ్ళిపోయాడు. విశ్వనాథ్ కుర్చీలో కూర్చొని బజ్జరు నొక్కాడు.

"సెక్రటరీని వెంటనే రమ్మను," అన్నాడతను గదిలోకొచ్చిన నౌఖరుతో.

2

రినోలో హోటల్ హిమాలయాకు చాలా మంచి పేరుంది. విదేశీయులు ఆ హోటల్లో బసచేస్తూ వుంటారు.

రిసెప్షన్ యువతితో మాట్లాడి బులెట్ మొదటి అంతస్తులో వున్న గది తీసుకున్నాడు. ఆమె తెరిచి ముందుకు తోసిన పుస్తకంలో 'వి. రాజ్ మోహన్' అని రాసి, వ్యాపారంమీద తను రగడా దేశానికి వచ్చినట్లు చిత్రించాడతను.

ఆమె యిచ్చిన తాళంచెవి తీసుకుని అతడు ఏర్ బాగ్‌తో లిఫ్ట్ వైపు వెళ్ళాడు. లిఫ్ట్ పైకి వెళ్తూండగా ఒక వ్యక్తి అతడివైపే చూడ్డం బులెట్ గమనించాడు.

ఆ వ్యక్తి, నల్ల పాంట్, స్లాక్‌లో వున్నాడు.

బులెట్ తన గదిలోకెళ్ళి తలుపు మూశాడు. కిటికీ కర్టెన్లను పక్కకు జరిపి కిందకు చూశాడు. హోటల్ ముందుభాగం, ఎదురుగావున్న తాయరోడ్డు అతడికి కనిపిస్తున్నాయి.

గదిలోకి బాగా వెలుగొస్తోంది. అతడు గది నలువైపులా చూశాడు–పక్కనే యటాచ్‌డ్ బాత్‌రూమ్ వుంది. గదిలో ఒకవైపున బెడ్, మరోవైపున మూడు సోఫాలున్నాయి. సోఫాలమధ్యన గుండ్రటి టీపాయి వుంది. గోడవారగా స్టీల్ బీరువా వుంది.

బులెట్ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. గోడకు చిన్న అద్దం, దాని ముందు వాషింగ్ బేసిన్, షవర్, కమోస్ వగైరా వున్నాయి. అతడు ముందు గదిలోకి తిరిగొచ్చాడు. సోఫాలో కూర్చుని కింగ్ సైజ్ స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్ వెలిగించాడు.

ఏదో చప్పుడైంది. అతడు గుమ్మంవైపు చూశాడు. ఎవరో తలుపును మెల్లిగా తట్టారు.

బులెట్ వెళ్ళి తలుపు తెరిచి ఎదురుగా నిలబడిన వ్యక్తివైపు చూశాడు. లిఫ్ట్‌లో పైకి వస్తూంటే తనవైపు చూసిన వ్యక్తి అతడే!

ఎదురుగా వున్నతని పెదిమః మీద చిరునవ్వు నృత్యం చేస్తోంది. అతడు కళ్ళజోడు ధరించాడు. జుత్తు తెల్లబడింది కాని అతడు బలంగానే అగుపిస్తున్నాడు.

“నా పేరు రషీద్. నేను హోటల్ ప్రొప్రయిటర్ని. మీతో పరిచయం చేసుకోడానికి వచ్చాను” అన్నాడతను.

“కమిన్!” అన్నాడు బులెట్.

తలుపు దగ్గరగా మూసివుంది. రషీద్ అతడి ఎదురుగా కూర్చున్నాడు. క్షణకాలం అతడు మాట్లాడకుండా బులెట్ వైపు చూశాడు.

“మిస్టర్ బులెట్, విశ్వనాథ్ మీగురించి నాతో మాట్లాడారు. మీకేం కావలసినా నేను సప్లయి చేస్తాను” అన్నాడతను.

బులెట్ నవ్వుతూ అతనివంక చూశాడు.

“ఒక అరడజన్ స్కాచ్ విస్కీ షీవాస్ రీగల్ బాటిల్సు పంపండి. కూల్ బాక్స్‌లో కొన్ని సోడా బుడ్లు” అన్నాడు బులెట్.

“వెంటనే పంపిస్తాను.”

"నాకు ఐదువేల డయాల్స్ క్యాష్ కావాలి."

"ఇస్తాను."

"నాకొక కారు కావాలి."

"కొత్త ప్లిమత్ కారు మీకు సప్లయి చేస్తాను."

బులెట్ అతడివైపు సూటిగా చూశాడు.

"మన గూఢచారులు BN 21, BN 51 మీకు కనిపించారా?"

"మీ కోడ్ నేమ్ ప్లీజ్?" అన్నాడతను.

"BE 15" అన్నాడు బులెట్ గన్ షాట్టులా.

"వాళ్ళు నన్ను కలుసుకుని వారం దాటింది. ఇద్దరికీ చాలా డబ్బు ఇచ్చాను. అది ఖర్చయిపోతేగాని వాళ్ళు యిక్కడకు రారు!"

"వాళ్ళు ఎక్కడున్నారో మీకు తెలియదా!"

"తెలియదు"

"BN 10 హరిసింగ్, BN 40 దత్తూరామ్ గూఢచారులు ఎలా హత్య చేయబడ్డారు?"

"BN 10 శవం పోలీసులకు సీమ్ నది ఒడ్డున దొరికింది. అప్పటికే అతడు మరణించి మూడు రోజులు అయివుండాలని పేపర్లలో చదివాను. BN 40 శవం రోడ్డువారగా పోలీసులకు దొరికింది. రాత్రి ఎప్పుడో అతడిని కత్తితో పొడిచి చంపారు" అన్నాడు రషీద్.

"వాళ్ళని ఎవరు చంపివుంటారు?"

"పిండారిస్తాన్ గూఢచారులై వుండాలి. భారతదేశానికి వాళ్ళు గర్భశత్రువులు!" అన్నాడు రషీద్.

"ఇక్కడ పిండారిస్తాన్ గూఢచారాలు ఎక్కువగా వున్నారా?"

"కొన్ని వందలమంది వున్నారు. ఈ దేశం సరిహద్దు దాటితే వాళ్ళ దేశం వస్తుంది. అనేక వస్తువులను యీ

దేశం పిండారిస్తాన్ మీద ఆధరపడాలి. అందువలన యీ దేశప్రభుత్వం పిండారిస్తాన్‌తో ఎప్పుడూ పోట్లాటకు దిగదు. పిండారిస్తాన్ వాళ్ళకు యిక్కడ పలుకుబడి ఎక్కువ'' అన్నాడతను.

బులెట్ నవ్వుతూ రషీద్ వైపు చూశాడు.

''మిస్టర్ రషీద్, మీరిక్కడ ఎంతకాలం నుంచి వుంటున్నారు?''

''నేను భారత దేశస్థుడిని. నేనిక్కడికొచ్చి ఇరవై ఏళ్ళు దాటింది. రగడా సిటిజన్ అయ్యాను. నేనిక్కడున్నా నా మాతృభూమి భారతదేశమే!''

అతడి మాటలు విని బులెట్ లోలోపల చాలా సంతోషించాడు. అతడికి బైబై చెప్పి రషీద్ బయటకు వెళ్ళిపోయాడు.

కాస్సేపట్లో విస్కీ బాటిల్సు, గ్లాసులు, కూల్ బాక్సులో సోడాబుడ్లు వచ్చాయి. యూనిఫామ్‌లో వున్న హోటల్ బాయ్ వాటిని ఒక టేబుల్ మీద పెట్టాడు.

''ఒక బాటిల్, రెండు సోడాబుడ్లు, ఒక గ్లాసు యిక్కడ పెట్టు'' అన్నాడు బులెట్.

అతడు చెప్పినట్లు చేసి హోటల్ బాయ్ వెళ్ళిపోయాడు.

విస్కీ బాటిల్ తెరిచి కొంచెం గ్లాసులో పోసి అతడు సోడా కలిపాడు. విస్కీ తాగుతూ విశ్వనాథ్ యిచ్చిన ఫోటోలను చూసి, వెనకనున్న అడ్రసులను అతను గుర్తుంచుకున్నాడు.

ఎవరో తలుపును తట్టారు.

''కమిన్!'' అన్నాడతను.

సన్నగా, పొడుగ్గా వున్న ఒకతను గదిలోకొచ్చి ఓ కవర్ను అతడికిచ్చాడు. కారు ఇగ్నిషన్ కీ ఇచ్చాడు.

"మిస్టర్ రషీద్ మీ కిమ్మన్నారు" అన్నాడతను.

"ఆయనకు నా థాంక్స్ చెప్పు" అన్నాడు బులెట్.

అతడు వెళ్ళాక బులెట్ మరో మూడు పెగ్గులు విస్కీ సేవించి టైమ్ చూశాడు. ఐదు కావస్తోంది!

ఏర్‌పోర్ట్‌లో దిగ్గానే బులెట్ తన వాచ్‌ని దిద్ది, సరిగ్గా టైమ్ పెట్టుకున్నాడు.

అతడు బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. తిరిగొచ్చి దుస్తులు మార్చుకున్నాడు. గదిలోంచి బయటకు నడిచి, తలుపు మూసి తాళంవేశాడు. లిఫ్ట్‌లో కిందకు చేరుకున్నాడు.

ముందు హాల్లో రషీద్ అతడికి అగుపించాడు.

"మిస్టర్ రాజ్ మోహన్, మీకిక్కడ సౌకర్యంగా వుందిగా?" అనడిగాతను.

"ఫైన్" అన్నాడు బులెట్ నవ్వుతూ.

3

హోటల్ ముందు నల్లటి ప్లిమత్ కారుంది. తాళంతీసి అతడు స్టీరింగ్ వెనక కూర్చున్నాడు. తలుపు మూశాడు. క్షణకాలం కారును పరీక్షించాడు. టాంక్ నిండా పెట్రోలుంది.

తన కోటు జేబులో వున్న రినో పట్నం మాప్‌ను తెరిచి చూస్తూ కూర్చున్నాడు. BN 21 వుండే యిల్లు ఏ రోడ్డు మీదుందో కనుక్కున్నాడతను. మాస్కాట్ రోడ్డు నంబరు 10, రూమ్ నంబరు 50.

బులెట్ కారును పోనిచ్చాడు. సూర్యుడు పడమర దిక్కున దిగుతున్నాడు. ఇంకా బాగా వెలుతురు వుంది. అనేక రోడ్లు తిరిగి అతడు మాస్కాట్ రోడ్డుకు చేరుకున్నాడు.

నంబర్ 10 ఎనిమిది అంతస్తుల భవనం. BN 21 ఆరో అంతస్తులో వుండాలి! రోడ్డువారగా కారును ఆపి

అతను దిగాడు.

ముందుగదిలోకి వెళ్ళాడు. వాచ్‌మన్ అతడివంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"రూమ్ నంబర్ 50," అన్నాడతను.

"ఆయన గదిలో లేరు. ఎక్కడికో వెళ్ళి చాలా రోజు లయింది," అన్నాడు వాచ్‌మన్.

"ఒకసారి అతడి గదికెళ్ళి చూస్తాను!"

"మీ యిష్టం" అని వాచ్‌మన్ భుజాలను యెగరేశాడు.

లిఫ్ట్‌లో బుల్లెట్ ఆరో అంతస్థు చేరుకొన్నాడు. నడవమ్మట నడచి 50 నంబరు గదిముందు నిలబడ్డాడు. 50 నెంబర్‌కి యిటూ అటూ చాలా గదులున్నాయి, కాని నడవలో ఎవ్వరూ లేరు.

చటుక్కున 51 నంబరుగది తలుపు తెరవబడింది. ఒక యువతి బయటకొచ్చి అతడివంక చూసింది.

"శ్యామ్ వచ్చాడేమో ననుకున్నాను!" అందామె.

నిరుత్సాహంగా ఆమె వెనక్కు తిరిగింది.

"శ్యామ్ నీకు బాగా తెలుసా?" ప్రశ్నించాడు బులెట్.

"మేం స్నేహితులం" అందామె.

బులెట్ నవ్వుతూ ఆమెకేసి చూశాడు.

"అతడిని చూడ్డానికి ఇండియానుంచి వచ్చాను. అతను ఎక్కడికెళ్ళాడో తెలుసా?"

"అతడు గదికొచ్చి పదిరోజులు దాటింది. ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు!" అందామె.

"నువ్వు ఏం చేస్తున్నావు?"

"ఒక కంపెనీలో టెలిఫోన్ ఆపరేటర్‌గా వుంటున్నాను," అందామె.

"నిన్ను కలుసుకున్నందుకు చాలా సంతోషం. ఇవాళ రాత్రి నాతో డిన్నర్‌కి వస్తే ఆనందిస్తాను."

"ఎక్కడ?"

"నీకు నచ్చిన హోటల్లో!"

"ఆల్ రైట్ వస్తాను," అందామె.

బులెట్ సిగరెట్టు పాకెట్టు తెరిచి ఆమెకు సిగరెట్టు ఇవ్వబోయాడు.

"నేను కాల్చను," అందామె.

అతడు సిగరెట్టు వెలిగించాడు. పొగవదుల్తూ ఆమె వైపు చూశాడు.

"సరిగ్గా ఎనిమిదింటికి యిక్కడికొస్తాను. ఇద్దరం కలిసి వెళ్దాం," అన్నాడతను.

"అలాగే."

"నీ పేరు?"

"మిస్ లూసీ."

"నా పేరు రాజ్ మోహన్," అన్నాడతను.

అతడు లిఫ్ట్‌లో కిందికి దిగాడు. వాచ్‌మన్ యెవరితోనో మాట్లాడుతున్నాడు. బులెట్ తన ప్లిమత్ కార్లో కూర్చుని తలుపు మూశాడు.

వాచ్‌మన్‌తో మాట్లాడుతున్నతను తనని గమనించడం బులెట్ గుర్తించలేదు. ప్లిమత్ కారు కదిలింది.

వాచ్‌మన్‌తో వున్నతను సమీపంలోవున్న ఫోన్ దగ్గరకువెళ్ళి రిసీవర్ని ఎత్తి ఒకనంబర్ తిప్పాడు.

"హలో బాస్, అతడెవరో శ్యామ్‌కోసం వచ్చాడు. పొడుగ్గా బలంగావున్నాడు. R 2001 ప్లిమత్ కారులో వెళుతున్నాడు," అన్నాడతను.

"ఆల్ రైట్! అతడి విషయం మేం దర్యాప్తు చేస్తాం" అందొక అధికార కంఠం అటువైపునుంచి.

"ఎస్ బాస్," అని అతను రిసీవర్ని పెట్టేశాడు.

4

BN 51 పేయింగ్ గెస్టుగా ఒక కుటుంబంలో వుంటు న్నాడు. అక్కడికి ప్లిమత్ కారును పోనిచ్చాడు బులెట్. పాతకాలపు యింటిముందు కారు ఆగింది. ఎడంవైపు నున్న ఫ్లాట్ 12కి గుమ్మంముందు నిలబడి బులెట్ ఎల క్ట్రిక్ బెల్ నొక్కాడు.

గౌను ధరించిన ఒక ముసలామె తలుపు తెరిచి అతని వేపు చూసింది.

"మిస్టర్ రాజన్!" అన్నాడతను.

"రాజన్ మా యింట్లో వుండడంలేదు. ఖాళీచేసి వెళ్ళి పోయాడు." అందామె చిరాగ్గా.

"ఎందువలన?"

"అతడికోసం ఎవరెవరో వస్తూంటారు. మాకది నచ్చ లేదు. మేమే ఖాళీ చెయ్యమన్నాం."

"రాజన్ ఎక్కడికెళ్ళాడు?"

"అదంతా నాకు తెలియదు. అతడు నాతో చెప్ప లేదు!" అందామె.

"మమ్మీ!" అని పిలుస్తూ ఒక యువతి అక్కడికి కొచ్చింది.

ఆమెకేసి బులెట్ చూశాడు. పదెనిమిదేళ్ళ పిల్ల. చాలా అందంగావుంది. పాంటు, స్పోర్ట్సు బనియన్ ధరించింది.

ముసలామె తలుపు మూసేసింది. బులెట్ వెనుదిరిగి కారులో కూర్చుని సిగరెట్టు వెలిగించాడు. పొగవదుల్తూ ఆలోచించసాగాడు.

రాజన్ అతడికి బాగా తెలును. ఆడపిల్లలంటే రాజన్‌కి పిచ్చి! ఆ యింట్లో పేయింగ్ గెస్టుగావుంటూ

ఆ యువతితో సంబంధం లేకుండా రాజన్ వుండడం వూహాతీతం. ఆ యిల్లు వదిలేసినా రాజన్ ఆ యువతిని కలుసుకొంటూనే వుండొచ్చు.

తలుపుమూసి అతడు కారును పోనిచ్చాడు. చటుక్కున అతడికాలు బ్రేక్ మీద పడింది. ఆ యువతి వెనకనే రోడ్డమ్మట నడచివస్తోంది.

రోడ్డువారగా అతడు కారును ఆపి, కూర్చున్నాడు. పక్కనుంచి ఆమె వెళ్తోంది.

"మిస్!" అన్నాడతను.

కారు కిటికీలోంచి ఆమె లోపలకు చూసింది.

"హలో!" అందామె.

"యూ లవ్లీ!" అన్నాడతను.

సిగ్గుపడ్తూ ఆమె నిలబడింది.

"ఎక్కడికెళ్ళాలి?"

"సినిమాకి! బ్రాడ్వే థియేటర్ కి" అందామె.

"నేను అటే వెళ్తున్నాను. అక్కడ దింపేస్తాను," అన్నాడు బులెట్.

"థాంక్స్," అని ఆమె ముందుసీటుమీద కూర్చుని తలుపు మూసింది.

బులెట్ కారును పోనిచ్చాడు. పక్కనకూర్చున్నామె కేసి ఓరగా చూశాడు.

"నా పేరు రాజ్ మోహన్," అన్నాడతను.

"నా పేరు మిస్ రీటా," అందామె.

సిగరెట్టు పొగపీల్చి అతడు వదుల్తున్నాడు. చీకటి పడింది. రోడ్డుదీపాలు వెల్గుతున్నాయి.

"మిస్టర్ రాజ్ మోహన్! నేను సినిమాకు వెళ్ళాలనే వుద్దేశంతో బయటకు రాలేదు. రాజన్ని గురించి మమ్మల్ని మీరు అడగడం నేను విన్నాను. తనకోసం మీలాంటి

వ్యక్తి రావచ్చని రాజన్ నాతో చెప్పాడు. మీతో మాట్లాడ్డానికి వచ్చాను,'' అందామె.

''రాజన్ ఎక్కడున్నాడో తెలుసా?''

ఆమె వెంటనే జవాబివ్వలేదు. అతడివైపు చూసింది. ''రాజన్ కోడ్ నేమ్ ఏమిటో మీకు తెలుసా?''

''BN 51,'' అన్నాడతను.

''యూ ఆర్ రైట్. రాజన్ దగ్గరకు మిమ్మల్ని తీసుకెళ్తాను'' అందామె.

''ఐయామ్ లక్కీ!'' అన్నాడతను.

వెనకనే నల్లటి ఆస్టిన్ కారు వస్తోంది. రియర్ వ్యూ అద్దంలో ఆ కారు స్పష్టంగా కన్పిస్తోంది. కారులో డ్రయివర్ మాత్రం వున్నాడు. ఆ కారులోని మనిషి తనని వెంటాడుతున్నాడా?

తన కారును కుడివైపుకు తిప్పాడు బులెట్. వెనుక కారు తిన్నగా వెళ్ళిపోయింది. బులెట్ తనలో తను నవ్వుకొన్నాడు. ఆ రోడ్డమ్మట వెళ్ళి ప్లిమత్ కారు మెయిన్ రోడ్డుకు చేరుకొంది.

''రాజన్ మీ ఇంట్లోంచి ఎందుకు వెళ్ళిపోయాడు?'' అడిగాడతను.

''అమ్మకి అనుమానం ఎక్కువ. రాజన్ నాతో ఎక్కువగా మాట్లాడుతూ కూర్చునేవాడు. అందువలన అతడిని వెళ్ళిపొమ్మంది.''

''మనం ఎక్కడికి కెళ్ళాలి?''

''హోటల్ లియోకి వెళ్ళాలి.''

ఐదు నిమిషాల్లో హోటల్ లియో కాంపౌండులో అతడు కారుని ఆపి, దిగాడు. కొంచెం దూరంలో ఆస్టిన్ కారు ఆగివుంది! స్టీరింగ్ వెనక కూర్చున్న డ్రయివర్ వంక బులెట్ సూటిగా చూశాడు.

"కమాన్," అంది మిస్ రీటా.

ఆమెతో అతడు ముందుహాల్లోకి వెళ్ళాడు. ఆమె ఫోన్ బూత్‌లోకి దూరి కాస్సేపయ్యాక తిరిగి వచ్చింది. రిసెప్షన్ కౌంటరు ముందుకు వెళ్ళి ఒక తాళం చెవిని తెచ్చింది. బులెట్ ఆమెతో కింద భాగంలోవున్న 30 నంబరు గదిలోకి వెళ్ళాడు. ఆమె తలుపుమూసి తాళం చెవిని తిప్పింది.

గదిలో ఫ్లోరసెంటు లైటు వెల్గుతోంది.

"మీరు కూర్చోండి. రాజన్ యిక్కడి కొస్తాడు," అందామె.

బులెట్ ఆమెకేసి నవ్వుతూ చూశాడు. సోఫాలో కూర్చున్నాడు. ఎదురుగా ఆమె కూర్చుంది.

గదిబయట బూట్ల చప్పుడయింది. బులెట్ గుమ్మం వైపు పరిగెత్తుకెళ్ళి, తాళంతీసి, తలుపుతెరిచి బయటకు చూశాడు.

ఆసిన్ట్ శరులో తను చూసినతను గది ముందునుంచి వేగంగా వెళ్ళిపోయాడు! నడవచివర మలుపు తిరిగి అతడు మాయమయ్యాడు.

మళ్ళీ సోఫాలో కూర్చున్నాడు బులెట్. ఆమెకేసి నవ్వుతూ చూశాడు.

"అతను రావడానికి ఎంత టైమ్ పడుతుంది?"

"కాస్సేపట్లో వస్తాడు," అందామె.

నిజంగా రాజన్ వస్తాడా? లేక ఆమె నాటకమాడుతోందా? బులెట్ ఆలోచిస్తున్నాడు.

5

ఎవరో తలుపును మూడుసార్లు తట్టారు.

ఆమె వెళ్ళి తలుపును తెరిచింది. పొడుగ్గా, సన్నగా

వున్న ఒకతను వుషారుగా లోపలకొచ్చాడు. ఆమె తలుపు మూసింది.

బులెట్ లేచి నిలబడి అతనితో కరచాలనం చేశాడు.

"రాజన్, ఎలావున్నావ్?" అన్నాడు బులెట్.

"ఇక్కడకు నువ్వొచ్చినందుకు సంతోషం," అని రాజన్ గదిలోవున్న ఆమెకేసి చూశాడు.

"రీటా, మేం కొన్ని ముఖ్యవిషయాలు మాట్లాడాలి. నువ్వు హోటల్ ముందుహాల్లో కూర్చో!" అన్నాడు రాజన్.

"నే విన్నా ఎవ్వరికీ చెప్పను" అందామె.

"వినకుండా వుండడం నీకు శ్రేయస్కరం" అన్నాడు రాజన్.

ఆమె బయటకు వెళ్ళింది. రాజన్ తలుపుమూసి తాళం వేసాడు. క్షణకాలం గది నలువైపులా చూశాడు. ఎక్కడా మైక్స్ లేవని నిర్ధారణ చేసుకొన్నాడు.

బులెట్ ప్రక్కన కూర్చొన్నాడు. బులెట్ వంక సీరియస్‌గా చూశాడు.

"మిస్టర్ బులెట్, శ్యామ్ వాళ్ళ చేతుల్లో వున్నాడని నా అనుమానం. ఎప్పుడో అతని శవం పోలీసులకు దొరుకుతుంది" అన్నాడు రాజన్.

"గుడ్ గాడ్!" అన్నాడు బులెట్.

"ఇండియన్ గూఢచారులు ఏగడాదేశంలో లేకుండా చూడ్డానికి పిండారిస్తాన్ గూఢచార్లు కంకణం కట్టుకొన్నారు. ఇద్దరు హత్య చేయబడ్డారు. మూడోవాడు శ్యామ్. పోతే నేను ఒక్కడినే యిక్కడ మిగుల్తాను. నన్నూ ఎప్పుడో తుదముట్టిస్తారు. వాళ్ళకు దొరకకుండా ఎంతో రహస్యంగా వుండవలసి వస్తోంది," అన్నాడు రాజన్.

"పిండారిస్తాన్ గూఢచారులకు మనం బుద్ధి చెప్పాలి" అన్నాడు బులెట్.

"ప్రస్తుత పరిస్థితుల్లో వాళ్ళను మనం జాడించలేము. వీలయినంత తొందరగా నేను మనదేశానికి పోవాలని చూస్తున్నాను" అన్నాడు రాజన్.

బులెట్ అతడివంక సూటిగా చూశాడు.

"మిస్టర్ రాజన్! తోకలు ముడుచుకొని మనం పారిపోడం మంచిదికాదు. మనం ధైర్యంగా నిలబడాలి. ప్రాణానికి ప్రాణంతీసి వాళ్ళను భయపెట్టాలి. అప్పుడు వాళ్ళు మనజోలికి రారు!" అన్నాడు బులెట్.

"అదంతా ఎలా సాధించాలో నువ్వే ఆలోచించాలి"

బులెట్ సోఫాలోంచి లేచాడు. అతడివైపు చూసేడు.

"ఈదేశంలో పిండారిస్తాన్ గూఢచారులు యెంతమంది వున్నారు?"

"రెండు వందలమంది వుంటారు."

"మన వాళ్ళిద్దరు మరణించారు. వాళ్ళల్లో ఎవర్నైనా మీరు చంపగల్గారా?"

"లేదు!"

"అందుకే వాళ్ళు విర్రవీగుతున్నారు. వాళ్ళకి కొమ్ములొచ్చాయి. కొమ్ముల్ని మనం విరగ్గొట్టాలి!" అన్నాడు బులెట్.

"అందుకు మనబలం చాలదు!"

"ధైర్యంగా వ్యవహరిస్తే ఒక్కడు వందమందిని చిత్తు చేయొచ్చు," అరిచాడు బులెట్.

రాజన్ మౌనంగా విన్నాడు. బులెట్ మాటలు వింటే అతడికి ధైర్యమొస్తోంది.

"శ్యామ్‌ని వాళ్లు ఎక్కడ దాచివుంటారు?"

“ఈ పట్నంలో వాళ్ళ స్థావరం వుంది. అక్కడ దాచివుంటారు.”

“అక్కడకు మనం వెళ్దాం” అన్నాడు బులెట్.

రాజన్ ఆశ్చర్యంగా చూశాడు అతనివైపు.

“మృత్యు కుహరంలోకి అడుగు పెట్టినట్లవుతుంది! అక్కడనుండి మనం ప్రాణాల్తో బయట పడలేం,” అన్నాడు రాజన్.

బులెట్ ఫక్కున నవ్వాడు.

“వాళ్లెంత ధైర్యవంతులో పరీక్షిద్దాం” అన్నాడు బులెట్.

“ధైర్యం వివేకంతో కూడినదై వుండాలి!”

“వివేకం మనిషిని వెనక్కు లాగుతుంది. మొండి ధైర్యంతో మనం యీపని చెయ్యాలి”అన్నాడు బులెట్.

ఓ నిముషంపాటు గదిలో నిశ్శబ్దంగావుంది. బులెట్ అతడివంక చూశాడు.

“మిస్టర్ రాజన్, మనిద్దరం ఆ స్థావరంలోకి వెళ్లొద్దు! నేను ఒంటరిగా లోపలకు వెళతాను. నేను ఓ గంటలో తిరిగి రాకపోతే నువ్వు పోలీసులతో ఆ స్థావరంమీద దాడి చెయ్యాలి!”

“ఇక్కడి పోలీసులంతగా కల్పించుకోరు” అన్నాడు రాజన్.

“రగడా మనదేశానికి శత్రువుకాదు. మన దేశంనుంచి ఎన్నో వస్తువులు యిక్కడకు ఎక్స్‌పోర్టు అవుతున్నాయి. ఇండియన్ ఇంజనీర్లు యిక్కడ యెన్నో ప్రాజెక్టులలో సహకరిస్తున్నారు. ఇండియన్ కాన్సలేటు ద్వారా నేను పోలీసు అధికారులను కల్సుకొంటాను. వాళ్ళు మనకు సహాయపడ్తారు” అన్నాడు బులెట్.

"ఆ విధంగావస్తే పనులు జరుగుతాయి," రాజన్ ఒప్పుకొన్నాడు.

"మళ్ళీ నిన్ను ఎక్కడ కలుసుకోవాలి?"

"3877 నంబర్ కి ఫోన్ చేసి సీమా కావాలని అడుగు. సీమావచ్చాక నీపేరు బులెట్ అని చెప్పి నేను కావాలను ఆమె నన్ను పిలుస్తుంది."

"సీమా ఎవరు?"

"ఆమె యింట్లో నేను వుంటున్నాను. ఆమెభర్త పెద్ద వుద్యోగంచేసి చచ్చిపోయాడు. ఆమెకు బాగా డబ్బుంది. నేనంటే ఆమెకెంతో ఇష్టం. ఆమె ఇంట్లో వుంటున్నాను. ఆమెకు తల్లితప్ప మరెవ్వరూ లేరు."

"ఆమె నీకు ద్రోహం చెయ్యదుగా."

"ఇంపాసిబుల్. రెండు మూడుసార్లు ప్రమాదాల నుంచి ఆమె నన్ను కాపాడింది."

"రీటా ఎటువంటిది?" అడిగాడు బులెట్.

"అమాయకురాలు. ఎక్కువగా వాగుతుందని నా భయం. నా ఫోన్ నెంబర్ ఆమెకు తెలుసు. నేనెక్కడున్నదీ ఆమెకు తెలియదు. ఆమెను నేనీ గదిలో కలుసు కొంటూంటాను."

"మిస్టర్ రాజన్, ఎక్కువగా ఆడవాళ్ళతో తిరగడం ప్రమాదకరం. ఒకోసారి డిబ్లెలాలు సంభవిస్తారు," అన్నాడు బులెట్ నవ్వుతూ.

బయట మళ్ళీ బూట్ల చప్పుడయింది. బులెట్ తలుపు తెరిచి చూశాడు, ఆస్టిన్ కారులోని వ్యక్తి గుమ్మంముందు నుంచి కదులుతున్నాడు.

అతనివైపు దూకాడు బులెట్. కుడిచేత్తో అతని మెడను పట్టుకొని గదిలోకి లాక్కొచ్చి తలుపుమూసేడు.

అతడు గింజుకొంటున్నాడు. బులెట్ అతడిని మోకాలితో పొడిచాడు. అతడు కిందపడ్డాడు.

"వీడొక పిండారిస్తాన్ గూఢచారి!" అన్నాడు రాజన్.

నేలమీద పడున్న అతనివంక బులెట్ కోపంగా చూశాడు.

"అతని జేబులు వెతుకు!" అరిచాడు బులెట్.

రాజన్ అతని జేబులు వెతికాడు. ఒకపిస్టల్, చిన్న కత్తి, పర్సు వున్నాయి. వాటిని సోఫాలో పడేశాడు రాజన్.

"ఏమిటీ దౌర్జన్యం?" అరిచాడతను.

అతడివైపు సూటిగా చూశాడు బులెట్.

"ఎందుకు నన్ను వెంటాడుతున్నావ్."

"నిన్ను నేను వెంటాడ్డంలేదు. రూం నెంబర్ 40 లో నా మిత్రుడున్నాడు. అతనితో మాట్లాడి నేను పోతూ వుంటే గదిలోకి లాక్కొచ్చావు" అరిచాడతను.

"నీకారు నాకారు వెనకనే వచ్చింది!"

"హోటల్ లియోకి వచ్చేవాళ్ళకి రెండే రోడ్లు వున్నాయి. నా పనిమీద నేనొచ్చాను. నువ్వెవరో నాకు తెలీదు" అన్నాడతను.

"వాడు పిండారిస్తాన్ గూఢచారి. ఇంతకు ముందు వాడిని ఎన్నిసార్లో చూశాను" అన్నాడు రాజన్.

బులెట్ అతడిని మళ్ళా బూటుతో తన్నాడు. అతడు నేలమీద దొర్లుతూ దూరంగా వెళ్ళాక లేవబోయాడు. బులెట్ అతడివైపు మూడుకాళ్ళ పొట్టలో పొడిచాడు. అతడు అరుస్తూ వెనక్కి తగ్గాడు.

బూటుని అతడి ఛాతీమీద ఆనించాడు బులెట్.

"రాస్కెల్, నిజం చెప్పు!" గర్జించాడు.

"నేను వంటరిగా లేను. నేను బయటకు వెళ్ళకపోతే నన్ను వెతుక్కొంటూ యిద్దరు యిక్కడికొస్తారు!" అన్నాడతను.

"నువ్వీ గదిలో వున్నావని వాళ్ళకేం తెలుసు?"

"ఈ గదిలో వుంటానని వాళ్ళు వూహిస్తారు. వాళ్ళకీ గది నంబరు తెలుసు," అన్నాడతను.

"నువ్వు చెప్పింది నువ్వొక గూఢచారివని ఋజువు చేస్తోంది. నా గదిలోకొచ్చిన వాళ్ళు తిరిగి వెళ్ళరు," అన్నాడు బులెట్.

జేబిలోంచి కత్తిని బయటకు తీశాడు బులెట్. అతడి కంఠంమీద కత్తికొనను వుంచాడు.

"నా ప్రశ్నలకు జవాబియ్యి, లేకపోతే యిది నీ గొంతులోకి దిగుతుంది" అర్చాడు బులెట్.

"నేను ఏమీ చెప్పలేను" అన్నాడతను.

"నీ పేరు?"

"కరీమ్."

"నువ్వు నన్ను వెంటాడుతున్నావా?"

"నువ్వు ఎక్కడికెళతావో బాస్ చూడమన్నారు."

"మీ బాస్ ఎవరు?"

"నాకు పేరు తెలియదు."

కత్తికొన చర్మాన్ని పీకింది. అతడు బాధతో అర్చాడు. కొద్దిగా రక్తం చిమ్ముతోంది.

"స్టార్ట్ టాకింగ్" అర్చాడు బులెట్.

"బాస్ పేరు నాగిన్."

"ఇండియన్ గూఢచారుల్ని మీరు ఎందుకు చంపారు?"

"నే చంపలేదు!"

"మీవాళ్ళు ఎందుకు చంపారని అడుగుతున్నాను."

"మావాళ్ళు చంపలేదు!"

క త్తికొన అతని గడ్డానికి గుచ్చుకొంది. అతడు మూలు గుతూ బులెట్ వంక చూశాడు.

"నన్ను పోనీ! నీకంతా చెప్పాను!"

"నిన్ను చంపి నీ శవాన్ని నీవాళ్ళకు పంపుతాను. ఇండియన్ గూఢచార్లను ముట్టుకొంటే మూతులు మాడు తాయని వాళ్లు నేర్చుకుంటారు!"

అతడి శరీరం వణుకుతోంది.

"ప్లీజ్! నన్ను చంపొద్దు!"

"ప్రాణానికి ప్రాణం!" అర్చాడు బులెట్.

"వాళ్ళను చంపినవాళ్ళని నువ్వు చంపాలి. నన్ను చంపడం న్యాయంకాదు!"

"వాళ్ళను ఎవరు చంపారు?"

"బాస్ చంపమని ఉత్తరువిచ్చాడు. అతడి కుడిభుజ మయిన చెంగీజ్ వాళ్ళను చంపాడు."

"చెంగీజ్ ఎక్కడుంటాడు?"

"రాత్రి పది తర్వాత అతడు తను వుంచుకొన్న ముండ యింట్లో వుంటాడు. ఆమెపేరు నజ్మా. ఆమె టోల్ గేటు రోడ్డుమీదున్న నంబర్ 37 ఇంట్లోవుంటుంది" అన్నాడతను.

బులెట్ అతనిని లేవదీశాడు. అతడిని సోఫాలో కూర్చొబెట్టి మంచినీళ్ళు యిచ్చాడు.

"మిస్టర్ కరీమ్, నిన్ను వదిలేస్తున్నాను. నేనుచాలా చెడ్డవాడిని. ఇటుపైన నాజోలికి రాకు! ప్రాణంతో బయట పడుతున్నందుకు సంతోషించు. నీ పర్స్ పట్టుకు పో. తతిమ్మావి మా దగ్గరుంటాయి" అన్నాడు బులెట్.

కరీమ్ తన పర్స్‌ని జేబులో పడేసుకొని గుమ్మంవైపు నడిచాడు. తలుపు తెరిచేముందు బులెట్ అతడివంక సూటిగా చూశాడు.

"మళ్ళా నా చేతుల్లో పడకుండా జాగ్రత్తపడు!" అన్నాడు బులెట్.

కరీమ్ మౌనంగా బయటకు వెళ్ళిపోయాడు.

"మిస్టర్ రాజన్, పిండారిస్తాన్ గూఢచారి యెంత ధైర్యం గలవాడో చూశావుగా!" అన్నాడు బులెట్ వ్యంగ్యంగా.

"వాళ్ళను మనం నమ్మలేం! అతడు నీమీద పగ సాధించడానికి ప్రయత్నిస్తాడు" అన్నాడు రాజన్.

"డోంట్ బాదర్! నేను నీకు ఫోన్ చేస్తాను. ఆ స్థావరాన్ని నాకు చూపించు. గుడ్ నైట్" అని బులెట్ గదిలోంచి బయటకు కదిలాడు.

అతను వెళ్ళిన ఓ నిముషం తర్వాత రాజన్ బయటకు నడిచి, గదికి తాళం వేసి, హోటల్ ముందుహాలు వైపు అడుగులేశాడు.

6

టైమ్ ఎనిమిది దాటింది. బులెట్ కారును వేగంగా పోనిస్తున్నాడు. సిమెంటురోడ్డు లైట్లకాంతిలో మెరుస్తోంది. పక్క కూర్చున్న లూసీవంక చూసాడతను.

ఇరవైయేళ్ళ యువతి. పచ్చగా అందంగావుందామె. సిల్కుగౌను ధరించింది. చెవులకు పెద్దరింగులున్నాయి. మెళ్ళో బంగారం గొలుసుంది.

"ఎక్కడికెళదాం?" అడిగాడతను.

"మీ యిష్టం," అందామె.

"నీకే హోటల్లో తినాలనివుంది?"

"హోటల్ టాంగో బాగుంటుందని విన్నాను. నేను ఎప్పుడూ వెళ్ళలేదు. అక్కడికెళ్ళాలంటే ఎక్కువగా డబ్బు ఖర్చవుతుంది" అందామె.

"అక్కడికే వెళదాం," అన్నాడు బులెట్.

హోటల్ టాంగో కాంపౌండ్‌లో అతడు కారాపి దిగాడు. ఇద్దరూ లోపలకు వెళ్ళారు. ఏర్ కండిషండ్ డైనింగ్ హాలు చాలా విశాలంగా వుంది. ఎన్నో ఫ్లోరో సెంటు లైట్లు ప్రకాశవంతంగా వెలుతున్నాయి. తగ్గు స్వరంలో వెస్టర్న్ మ్యూజిక్ వినపడ్తోంది.

ఎదురెదురుగా వాళ్ళు కూర్చున్నారు. ఎర్రటి యూని ఫామ్‌లో వున్న బేరర్ వచ్చి సలామ్ చేసి మెనూకార్డు టేబిల్ మీద పెట్టాడు.

"డిన్నర్ ముందు డ్రింక్స్ సార్?" అడిగాడతను.

"షివాస్ రీగల్ విస్కీ బాటిల్, సోడాలు" ఆర్డర్ ఇచ్చాడు బులెట్.

బేరర్ వెళ్ళిపోయాడు. డైనింగ్ హాలు నలువైపులా చూశాడతను. వందమందిపైగా డైనింగ్ హాల్లోవున్నారు. టేబిల్స్ దూరదూరంగా అమర్చబడి వున్నాయి. అందు వలన ఒకళ్ళమాటలు పక్క టేబిల్ దగ్గర కూర్చున్న వాళ్ళకు వినపడవు.

బేరర్ స్కాచ్ బాటిల్ తెచ్చి టేబిల్ మీదుంచాడు. సోడా బుడ్లనూ, రెండు గ్లాసులనూ పెట్టాడు.

రెండు గ్లాసుల్లో ఆమె విస్కీ పోసి సోడా కలిపింది'

ఇద్దరూ గ్లాసుల నందుకున్నారు. చియర్స్ చెప్పి గ్లాసును బులెట్ క్షణంలో ఖాళీచేశాడు.

"మీరు చాలా ఫాస్ట్!" అందామె.

"ఐయామె ఫాస్ట్ వర్కర్," అన్నాడతను.

లూసీ మెల్లిగా తాగుతోంది. అతడామెకేసినవ్వుతూ చూసాడు.

"నువ్వాగదిలో ఒంటరిగా వుంటున్నావా?"

"నా తలిదండ్రులు పల్లెటూర్లో వున్నారు. ఉద్యోగం కోసం నేనిక్కడ ఒంటరిగా వుండవలసి వచ్చింది,"

అందామె.

"శ్యామ్ నీకెంత కాలంనుంచి తెలుసు?"

"గత ఆరుమాసాలనుంచి."

"అతడు ఏమయ్యాడో నీకు తెలుసా?"

"పిండారిస్తాన్ గూఢచారులు తనని విశేషంగా వెంటాడుతున్నారని శ్యామ్ నాతో చెప్పాడు. ఒకరోజు నేను ఆఫీసుకెళ్ళి వచ్చాను. ఆరాత్రి నన్ను డిన్నర్‌కి తీసుకువెళతానన్నాడు. కానీ అతడు రాలేదు. అప్పటి నుంచీ అతడు ఏమయ్యాడో తెలియదు."

విస్కీ తాగుతూ అతడామెకేసి చూశాడు.

"అతడికోసం ఎవరేనా గదికి వచ్చేవారా?"

"శ్యామ్ ఆ గదిలో వున్నాడని యెవ్వరికీ తెలియదు. అతడికోసం ఎవ్వరూ వచ్చేవారు కాదు!"

ఆరుపెగ్గుల తర్వాత డిన్నర్ వచ్చింది. ఇద్దరూ తృప్తికరంగా తిన్నారు. బులెట్ బిల్లు చెల్లించాడు. వాళ్ళు బయటకు నడిచి కార్లో కూర్చున్నారు.

అతడు కారుని పోనిస్తున్నాడు. ఆమె అతడి తొడ మీద చెయ్యివేసింది.

"శ్యామ్ నా మిత్రుడు. స్నేహితుల ప్రేయసిలను తస్కరించే అలవాటు నాకులేదు." అన్నాడతను.

ఆమె కిలకిల నవ్వింది.

"శ్యామ్ నన్ను పెళ్ళాడలేదు. అటువంటి వుద్దేశ్యం మా యిద్దరికీలేదు. ఐయామ్ ఫ్రీ!" అందామె.

బులెట్ నవ్వాడు. ఆమె నడుంచుట్టూ చెయ్యిని పోనిచ్చాడు.

"నీ గదికి వెళదామా?"

"మరోచోటకి పోదాం. నాకొక మంచి ప్రదేశం తెలుసు?"

"ఎక్కడ?"

"లవర్స్ డెన్! అక్కడ సిమెంటు సోఫాలుంటాయి. చంద్రుణ్ని చూస్తూ, చల్లగాలిలో మనం హాయిగా ఆడుకోవచ్చు!" అందామె.

"ఫైన్!" అన్నాడతను.

పెద్దతోటలో అతడు కారును ఆపాడు. అక్కడక్కడ లైట్లు వెలుగుతున్నాయి. దూరదూరంగా కార్లు ఆగి వున్నాయి. ఇద్దరూ కార్లోంచి దిగారు.

బులెట్ ఆమె నడుంచుట్టూ చెయ్యినిపోనిచ్చాడు. మెల్లిగానడిచి ఒక సోఫాదగ్గరకు చేరుకున్నారు. ఆమె సోఫాలో కూర్చుంది. అతడు పక్కనే కూర్చున్నాడు.

ఆకాశంలో చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. నక్షత్రాలు తళతళ మెరుస్తున్నాయి. ఆమె వెల్లకిలా సోఫామీద పడుకొంది. అతడామెమీదకు వాలాడు. ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు. లూసీచేతులు అతనిని చుట్టేశాయి.

"మిస్టర్ రాజ్ మోహన్, ఐ లవ్ యు!" అందామె.

"నాకు లవ్ లో నమ్మకంలేదు. ఆడదానికి పురుషుడు, మొగాడికి స్త్రీ కావాలి, అంతే. ప్రేమనే పేరుతో బానిసలయి పోవడం ప్రకృతికి విరుద్ధం. జంతువులు లైంగిక వాంఛలను తీర్చుకొని విడిపోతాయి. మనంకూడ అలా వుండగలిగితే యీ లోకంలో సమస్యలుండవు!"

"ప్రేమించడం మానవ లక్షణం!" అందామె.

"నేను మనిషిని కానేమో!" అన్నాడు బులెట్.

చంద్రకాంతిలో ఆమె పెదిమల ఎరుపు కనిపిస్తోంది. పళ్లు ముత్యాల్లా మెరుస్తున్నాయి. ఎందుకో ఆమె అరిచింది.

"లూసీ, ఏమయింది?" అడిగాడతను.

వెనుకనుంచి ముగ్గురు మనుషులు అతడిని బలంగా పట్టుకున్నారు. మరో ఏడుగురు అతడ్ని చుట్టుముట్టారు. కరీమ్ మీసాలను వేలితో నిమురుతూ అతడికి ప్రత్యక్షమయ్యాడు.

"మిస్టర్ రాజ్ మోహన్, ఇప్పుడేమంటావ్?" అన్నాడు కరీమ్.

"నా జోలికి రావద్దని నిన్ను హెచ్చరించాను. నువ్వు నామాట వినలేదు. కష్టపడ్తావు!" అన్నాడు బులెట్.

"కిక్ హిమ్!" అర్చాడు కరీమ్.

నలుగురు మనుషులు అతడిని బాదారు. బులెట్ వూపిరి బిగబట్టాడు. లటాలున అతడు గింజుకొని పైకి గెంతాడు. బూట్లతో యిద్దర్ని తన్నాడు. వాళ్ళు వెనక్కి పడ్డారు.

జేబులోంచి పిస్టల్ని తీశాడు. మూడుసార్లు షూట్ చేశాడు. ముగ్గురు అరుస్తూ నేలకూలారు. కొందరు చెట్ల వెనక్కి తప్పుకున్నారు.

కరీమ్ వైపు అతడు పిస్టల్నితిప్పి షూట్ చేశాడు. అతడు నేలమీద పడ్డాడు. నలువైపులా చూసాడు బులెట్. ఎవ్వరూ లేరు. వాళ్ళు పారిపోయి వుండొచ్చు!

లూసీ నవ్వుతూవచ్చి అతడిని కౌగలించుకోబోయింది. ఆమె చెంప పగిలింది.

"ట్రెయిటర్!" అన్నాడతను.

"నేను ద్రోహినికాను. వాళ్ళు మన్ని వెంటాడి ఇక్కడకు వచ్చుంటారు" అందామె.

ఆమెవంక అతను సూటిగా చూశాడు.

"శ్యామ్నుకూడా యిలాగే వాళ్ళకు అప్పగించి వుంటావ్. శ్యామ్ ఎక్కడున్నాడు?" అర్చాడుబులెట్టు.

"నాకు తెలియదు," అందామె.

కాల్తో ఆమెను తన్నాడతను. ఆమె సోఫామీద పడింది. దగ్గరగా వెళ్ళాడతను. ఆమెముక్కును వేళ్లతో పట్టుకొని పిండాడు. ఆమె మూలిగింది.

"చెప్పు!"

"శ్యామ్, శ్యామ్‌ని వాళ్ళు చంపేశారు. శవాన్ని కాల్చేశారు," అందామె.

"ఎవరు చంపారు?"

"చెంగీజ్."

"నువ్వు వాళ్ళ తరఫున పనిచేస్తున్నావని ఒప్పుకుంటావా?"

ఆమె తలాడించింది.

బులెట్టు జేబులోంచి కత్తి తీశాడు. ఆమె గాభరాగ అతడివైపు చూసింది.

"నన్ను చంపకు!" అర్చిందామె.

"చంపను. నిన్ను కుంటిదాన్ని చేసేస్తాను. ఇటుపైన కుంటుతూ శ్యామ్‌ని గురించి తల్చుకుంటూ జీవించు!" అన్నాడతను.

క్షణంలో ఆమె భయంకర అరుపు గాలిలో ధ్వనించింది. ఆమె కుడికాలు తెగి కిందపడింది. కత్తిని ఆమె గుడ్డలకు తుడిచి బులెట్టు తనకారువైపు పరుగెత్తాడు. ప్లిమత్ కారు వేగంగా రోడ్డమ్మట దూసుకుపోయింది.

7

టైం పన్నెండు కావస్తోంది. టోల్ గేటు రోడ్డుమీద ప్లిమత్ కారునాపి బులెట్టు కిందకి దిగాడు. టార్చి కాంతిలో 37వ నెంబర్ ఇల్లును గుర్తించాడు. మెల్లిగా యింటిముందు కెళ్ళాడు. క్షణకాలం నిలబడి నలువేపులా

చూశాడు. ఇరుగుపొరుగు ఇళ్ళలోని వాళ్ళు నిద్ర పోతున్నారు.

చప్పుడు చెయ్యకుండా బులెట్టు గుమ్మం ముందుకు చేరుకున్నాడు. టార్చికాంతిలో తలుపును చూశాడు. గోడ మీద ఎలక్ట్రిక్ బెల్ బటన్ కన్పించింది. దాన్నినొక్కి అతడు ఆలోచిస్తూ నిలబడ్డాడు.

నజ్మా చెంగిజ్ వుంపుడుగత్తె. ఆమెకు యితరులతో కూడ సంబంధం వుండొచ్చు. అతను మరోసారి బటన్ నొక్కాడు. లోపల్నుంచి కదుల్తూన్న కాళ్ళ చప్పుడు ఆతనికి వినిపించింది. తలుపు తెరవబడింది.

హాల్లోని ఫ్లోరసెంటు లైటు వెలుగుతోంది. ముప్ఫయి ఏళ్ళ వయస్సులోవున్న స్త్రీ పల్చటి మాక్సీలో అతని ముందు నిలబడింది.

నవ్వుతూ బులెట్టు ఆమెకేసి చూసాడు. ఆమె స్తనాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఆమె అతడివైపు కోపంగా చూసింది.

"మిస్టర్, ఇంత రాత్రివేళ రావడం?" అందామె.

"మిస్ నజ్మా, నీ గురించి విన్నాను. పొద్దుటే నా దేశానికి వెళ్ళిపోతున్నాను. నీ పరిచయం లేకుండా వెళ్ళడానికి మనసొప్పలేదు. తెగించి యిలా వచ్చాను."

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"ఐయామ్ సారీ! లోపల నా మిత్రుడున్నాడు. ఎవరేనా వస్తే నన్ను చంపుతాడు" అందామె.

"ఈపాటి కతడు నిద్రపోతూండాలి. నాకు రాత్రంతా అక్కర్లేదు. అరగంట నీతోవుంటే అదేచాలు. నీకోసం షివాస్ రీగల్ స్కాచ్ విస్కీ తెచ్చాను. నీకు యెంత డబ్బయినా యివ్వడానికి సిద్ధంగా వున్నాను" అన్నాడతను.

"కమిన్!" అంది నజ్మా.

అతడు లోపలకు వెళ్ళాడు. ఆమె తలుపు మూసింది. హాల్లో సోఫాలున్నాయి.

"100 డాలర్స్ ఇవ్వాలి. ఆ విస్కీ బాటిల్ నాది" అందామె.

"సంతోషంగా," అన్నాడతను, బాటిల్ని టీపాయ్ మీద పెడ్తూ.

"చెంగీజ్ డేంజరస్ మేన్. నా పడగ్గదిలో అతడు నిద్రపోతున్నాడు. ఇతర్లను నేను ఇలా రానిస్తున్నానని తెలిస్తే నన్ను చిత్రవధ చేస్తాడు. నీ పని ముగించి అర గంటలో వెళ్ళిపోవాలి" అందామె.

నజ్మా సోఫాలో పడుకొంది. పక్కనే కూర్చున్నాడతను. ఆమెవైపు నవ్వుతూ చూసాడు. తటాలున ఆమె కణతమీద చేత్తో కొట్టాడు. ఆమె కళ్ళు మూసింది. అతడు లేచి నిలబడ్డాడు.

ఆమెకేసి చూస్తూ వుండిపోయాడు. గంటదాకా ఆమె లేవదు. జేబులోంచి పిస్టల్ తీసి దానికి సైలెన్సర్ని అమర్చాడు. మెల్లిగా అతడు లోపలకు వెళ్ళాడు.

ఒక గదిలో ఓ ముసలామె పడుకొనివుంది. బులెట్టు బయటకొచ్చి తలుపు దగ్గరగా మూసాడు. మరోగది లోకి ప్రవేశించాడు.

జీరోవోల్టు బల్బు వెల్గుతోంది. అతడు స్విచ్ నొక్కాడు. గదిలోని లైటు వెలిగింది.

పెద్ద పరుపుమీద ఒకతను నగ్నంగా పడుకొని వున్నాడు. నల్లగా లావుగా వున్నాడు. పొట్టిగా కత్తిరించిన క్రాపు, పిల్లిగడ్డం, గుబురుగా పెరిగిన మీసాలు.

అతడు కళ్ళు తెరచి లైటువంక చూసాడు. "నజ్మా" పిల్చాడతను.

అతడి కంఠం బొంగురుగా వుంది.

అతడు లేచి కూర్చున్నాడు. గదిలోవున్న బులెట్టు వైపు అతడు ఆశ్చర్యంగా చూశాడు.

"ఎవరునువ్వు? ఇక్కడికెలా వచ్చావు?" అరిచాడతను.

"నువ్వు చంపిన ఇండియన్ గూఢచారులు నన్నిక్కడకు పంపారు. వాళ్ళ ఆత్మలకు శాంతిచేకూర్చమన్నారు" అన్నాడు బులెట్టు.

చెంగీజ్ పైజామాలోకి దూరాడు. బులెట్టు అతడి వంక పిస్టల్ని గురిపెట్టాడు.

"హరిసింగ్, దత్తూరామ్, శ్యామ్‌లను జ్ఞాపకం చేసుకో! వాళ్ళను చంపినందుకు నువ్వు శిక్ష అనుభవించాలి" అన్నాడు బులెట్.

చెంగీజ్ మాట్లాడలేదు. తనని కాపాడుకొనే అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు.

"చేతులెత్తు!"

అమాంతంగా చెంగీజ్ చేతులెత్తాడు. బొందు ముడి పెట్టని పైజామా కిందకి జారిపోయింది.

"నిన్ను చంపి, యీ గదిలోనే నీశవాన్ని కాల్చేస్తా" అరిచాడు బులెట్టు.

"ప్లీజ్, యిటుపైన ఇండియన్ గూఢచారుల జోలికి నేనుపోను. వాళ్ళను గౌరవంగా చూస్తాను. నన్ను చంపకు! పిల్లలున్న వాడ్ని!"

"నువ్వు చంపినవాళ్ళకూ పిల్లలున్నారు!"

"నాగిన్ చంపమంటే నేను చంపాను. అసలు హంతకుడు నాగిన్, నేనుకాదు."

"నాగిన్ నీ వెనకనే పైలోకానికి వెళతాడు!"

చెంగీజ్ భయంకరమైన మనిషి. ఐనా అతని కళ్ళు నీళ్ళతో నిండాయి. అతడివైపు వ్యంగ్యంగా చూసాడు బులెట్టు.

"ముసలి ఏడిస్తే నా హృదయం కరిగిపోదు!" అన్నాడు బులెట్టు.

"నీకేం కావాల్సినా యిస్తాను. నన్ను చంపకు!" ప్రతిమాలాడతను.

"రాస్కెల్ చెంగీజ్, కళ్ళు మూసుకొని దైవాన్ని ప్రార్థించుకో!"

చెంగీజ్ తలగడను అందుకున్నాడు. తనముందుదాన్ని షీల్డ్‌గా వుంచుకున్నాడు.

బులెట్టు ట్రిగ్గర్ నొక్కాడు. తలగడ కిందపడింది. చెంగీజ్ వెనక్కి జరిగాడు. మంచంకిందకి దూరడానికి వంగుతున్నాడు.

బులెట్టు ట్రిగ్గర్ని నొక్కాడు. అరుస్తూ చెంగీజ్ వెనక్కి పడ్డాడు. అతడి దగ్గరకు వెళ్ళాడు బులెట్టు. బొడ్డు ప్రాంతంనుంచి రక్తం కారుతోంది. బూటుతో అతని ముఖాన్ని తన్నేడు.

చెంగీజ్ బాధతో మూలుగుతున్నాడు. అతడివైపు మరోసారి షూట్ చేసాడు. చెంగీజ్ మొహం రక్తమయంగా అయింది. మరోక్షణంలో అతడిలో చలనం లేదు.

రక్తం మడుగులో పడున్న చెంగీజ్ వైపు బులెట్టు చూస్తూ నిలబడ్డాడు. సమీపంలోవున్న గుడ్డలను శవం మీద పడేశాడు. లైటర్‌తో గుడ్డల్ని అంటించి తన సిగరెట్టు వెలిగించుకొన్నాడు. పొగవదుల్తూ బులెట్టు గదిలోంచి కదిలాడు.

హాల్లో నజ్మా యింకా నిద్రపోతోంది. ఆమెపక్కనే టీపాయ్‌మీదున్న విస్కీ బాటిల్ని జేబిలో పెట్టుకొని, అతను బయటకు పోయాడు. సమీపంలోవున్న కారుదగ్గరకు చేరుకున్నాడు.

8

ప్లిమత్ కారు రోడ్డమ్మట దూసుకుపోతోంది.

రోడ్డువారగావున్న టెలిఫోన్ బూత్‌నుచూసి అతడు కారాపి దిగాడు. బూత్‌లోకి వెళ్ళి తలుపు మూశాడు.

3877 నంబరుకి ఫోన్ చేసాడు బుల్లెట్టు. అటువైపు నుంచి స్త్రీ కంఠం వినబడింది.

"సీమా కావాలి" అన్నాడతను.

మరో స్త్రీ రిసీవర్ని అందుకొంది.

"సీమా స్పీకింగ్!" అందామె.

"బుల్లెట్టు హియర్. రాజన్ కావాలి," అన్నాడతను.

వెంటనే రాజన్ వచ్చాడు.

"హలో బాస్!" అన్నాడు రాజన్.

"కిలిక్ సన్ రోడ్డు వారగావున్న టెలిఫోన్ బూత్ దగ్గర నేనుంటాను. వెంటనే రాగలవా?"

"ఎందుకు?"

"వాళ్ళ స్థావరం నాకు చూపించడానికి!"

"ఇంత రాత్రివేళా?"

"రాత్రివేళ అందరూ నిద్రపోతారు. ఇదే మంచి సమయం."

"వస్తాను," అన్నాడు రాజన్.

బూత్‌లోంచి బుల్లెట్టు బయటకొచ్చి సిగరెట్టుపీలుస్తూ కారుపక్కనే నిలబడ్డాడు. రోడ్డుమీద జనసంచారం లేదు.

మోరిస్ కారొచ్చి రోడ్డువారగా ఆగింది. కారు దగ్గరకు వెళ్ళాడు. కిటికీలోంచి కారులోపలకు చూసాడతను.

"మిస్టర్ బులెట్టు, నా కారువెనకనే నీ కారులోరా. వాళ్ళస్థావరం చూపిస్తాను," అన్నాడు రాజన్.

"ఆల్ రైట్" అన్నాడు బులెట్టు.

"చెంగీజ్ అక్కడ వుండకూడదని దేవుడిని ప్రార్థించాలి. వాడు పరమ దుర్మార్గుడు" అన్నాడు రాజన్.

"అతడక్కడలేడు!" అన్నాడు బులెట్టు.

"నీకెలా తెలుసు?" ప్రశ్నించాడు రాజన్.

"రేపటి పేపర్లలో నీకంతా తెలుస్తుంది."

"రేపటిదాకా సస్పెన్స్ ఎందుకు? ఏం జరిగిందో చెప్పు!" అడిగాడు రాజన్.

"మిస్టర్ రాజన్, దైవం మనిషికి రెండుచెవులు, ఒకే నోరు యిచ్చాడు. యెక్కువగా విను, తక్కువగా మాట్లాడు అని ప్రతివ్యక్తీ తెలుసుకోవాలి! ముందు పని కావాలి, పద!"

రాజన్ కారువెనకనే బులెట్టు తనకారుని పోనిచ్చాడు.

పెద్ద భవనాన్ని దాటి రోడ్డువారగా మోరిస్ కారు ఆగింది. వెనకనే బులెట్టు కారాపి దిగాడు. రాజన్ అతడి దగ్గరగా వచ్చాడు.

"ఆ భవనంవైపు చూడు, అదే వాళ్ళస్థావరం!" అన్నాడు రాజన్.

బులెట్టు గేటువైపు చూసాడు. ఒకడు రైఫిల్‌తో గేటుదగ్గర కాపలావున్నాడు. చుట్టూ ప్రహరీగోడవుంది. లోపలున్న మేడ రోడ్డుమీదున్న వాళ్ళకు కనిపిస్తోంది.

బులెట్టు వెనక్కితిరిగి రోడ్డమ్మట నడిచాడు. గేటు ముందునుంచి వెళ్తూ వాచ్‌మన్ వంక చూసాడు. లోపల ఎవ్వరూ మెలకువగా వున్నట్టులేదు. ఎక్కడా లైట్లు

లేవు. గేటుపైన మాత్రం లైటుంది. కొంతదూరం నడిచి అతడు వెనక్కితిరిగి కారుదగ్గరకు చేరుకున్నాడు.

"సులువుగా లోపలకు వెళ్ళొచ్చు!" అన్నాడు బులెట్.

"లోపలకు వెళ్ళడం సులువే. బయట పడ్డం కష్టం!" అన్నాడు రాజన్.

"వాళ్ళ బాస్ నాగిన్ యిక్కడే వుంటాడా?"

"మేడమీద వుంటాడతను," అన్నాడు రాజన్.

"మిస్టర్ రాజన్, నేను లోపలకు వెళ్తాను. నాకు మరికొన్ని వివరాలు కావాలి. నాగిన్ ఎలా వుంటాడు?"

"నాగిన్ పొట్టిగా, సన్నగా వుంటాడు. గాలిలో ఎగిరిపోతాడేమో నన్నట్లు వుంటాడు. అతడు తల్చుకుంటే ఎవరయినా గాలిలో మాయమవ్వాలసిందే! పైప్ నోట్లో వుంటుంది. పాంటు, స్లాక్ లో వుంటాడు. బాగా దాత్తువుంటుంది. అతను మంగలివాడిని దగ్గరకు రానివ్వడనుకుంటాను. తనే కత్తిరించుకుంటూ వుంటాడేమో!" అన్నాడు రాజన్.

"నువ్వు చెప్పినదాన్ని బట్టి పోల్చగలను. నువ్విక్కడే తిరుగుతూ వుండు. గంటలోపల నేను తిరిగివచ్చేస్తాను," అన్నాడు బులెట్.

"రాకపోతే?"

"ఇండియన్ కాన్సలేటుకి వెళ్ళి నేను యీ భవనంలో యిరుక్కుపోయానని చెప్పు. వాళ్ళు పోలీసురిపోర్ట్ యిస్తారు. పోలీసులతో నువ్వు భవనంలోకి రా! నువ్వు ఒంటరిగా రావద్దు!" అన్నాడతను.

"పోలీసులు యిక్కడికొచ్చివ దాకా నువ్వు బ్రతికి

వుండవు. చెంగీజ్ కాల్చి చంపేస్తాడు!"

"చెంగీజ్ ఇక్కడ లేడన్నావుగా."

"ఎక్కడున్నా అతడిని రప్పిస్తారు, నిన్ను చంపడానికి!"

"డోంట్ బాదర్! నేను పోయినా ఫరవాలేదు. మీరందరూ ఈ దేశంలో యిటుపైన క్షేమంగావుంటారు. నాకదే కావాలి," అన్నాడు బులెట్.

"నీ ప్రాణాన్ని అలా బలివ్వడం నా కిష్టంలేదు," అన్నాడు రాజన్.

"ముగ్గురు బలైన విషయం నువ్వు మర్చిపోతున్నావ్! వాళ్ళకు జరిగింది నీకూ సంభవించవచ్చు!" అన్నాడు బులెట్.

రాజన్ అమాంతంగా బులెట్‌ని కౌగలించుకున్నాడు.

"నీతో నేనూ వస్తాను."

"గంటలో నేను రాకపోతే రా. నేను విజయాన్ని సాధించి రాగలననే నమ్మకం నాకుంది" అన్నాడు బులెట్.

బులెట్ అతడితో కరచాలనం చేశాడు.

"గాడ్ బ్లెస్ యూ విత్ సక్సెస్!" అన్నాడు రాజన్.

9

రోడ్డుదాటి ప్రహరీ గోడవైపు నడిచాడు బులెట్. ప్రహరీగోడ వారగా నిలబడి చేతులు పైన ఆనించి అతడు గోడమీదకు చేరుకొన్నాడు.

గోడమీద కూర్చుని లోపలకు చూశాడు. యెన్నో చెట్లు, పూలమొక్కలు అతడికి చంద్రకాంతిలో కనిపించాయి. మెయిన్ గేటు దూరంలోవుంది. తనని వాచ్‌మన్ చూడలేదు!

బులెట్ అటువైపుకు మెల్లిగా దిగాడు. ఆరడుగులు పొడుగున్న మనిషి అవడంవలన అవలీలగా అటు దిగ గలిగాడు.

బులెట్ వయిసు 25 వుంటుంది. కసరత్తుతో కండలు తిరిగిన శరీరమతనిది. కరాటేలో అతడు ఆరితేరినవాడు. కరాటేలో రెడ్ బెల్టు పొందిన కొద్దిమందిలో ఇతను ఒకడు. షూటింగ్ లో అతడు సిద్ధహస్తుడు. ధైర్యానికి అతనిది మారుపేరు!

సిగరెట్టు పీలుస్తూ నిలబడ్డాడతను. తనచుట్టూవున్న చీకటికి కళ్ళు అలవాటుపడ్డాక అతడు భవనంవైపు కదిలాడు.

పెద్ద వరండా ముందున వుంది. వరండా మీదనుంచి మెట్లు పైకి వెళ్ళాయి. అతడు మేడమెట్లు మెల్లిగా ఎక్కాడు. అతడిచేతిలో సైలెన్సరమర్చిన పిస్టల్ వుంది. అతడు పై వరండామీదకు చేరుకొన్నాడు.

ఒక గుమ్మం ముందుకు వెళ్ళాడు. తలుపును తోసేడు. కదల్లేదు. లోపలనుంచి తలుపునుమూసి వుండాలని అతను గ్రహించాడు.

వరండామీద మరికొంత దూరం నడిచి మలుపు తిరిగాడు. పైనున్న వెంటిలేటర్ వంక చూశాడతను. చెయ్యి చాచి వెంటిలేటర్ని తడిమి చూశాడు. రెండు యినప కడ్డీలకు కర్రపలక అమర్చబడివుంది. అటుపక్కనున్నది యే బాత్ రూమో కావచ్చు. ఎటాచ్డ్ బాత్ రూమ్ తలుపులను చాలామంది లాక్ చేయరు.

అతడు వరండా నలువైపులా చూశాడు. ఒక ఖాళీ డబ్బా అతడికి కనిపించింది. డబ్బా ఎత్తుగావుంది.దాన్ని మోసుకొచ్చి అతడు నేలమీద వుంచాడు. డబ్బాపైకి ఎక్కాడు. వెంటిలేటర్ అతడికిప్పుడు బాగా అందింది.

జేబులోంచి స్పెషల్ మినీ రంపం తీసేడతను. బటన్ నొక్కాడు. అది బ్యాటరీ ఆధారంగా పనిచేస్తుంది. పది నిమిషాల్లో రెండు కడ్డీల కొనలనూ కోసేశాడతను.

కోసిన కడ్డీలను, కర్రపలకను మెల్లిగా నేలమీద పెట్టి అతడు మళ్ళా డబ్బాపైకి ఎక్కాడు. చేతుల్తో పైకిలేచి వెంటిలేటర్ రంధ్రంలోకి తలను, భుజాలను దూర్చాడు. గదిలో చీకటిగావుంది.

ఒక చేతి పట్టుతో అలాగేవుంచి రెండో చేత్తో లోపల గోడను తడిమిచూశాడు. ఏదో పైప్ అతడివేళ్ళకు తగిలింది. అతడు వేళ్ళతో పైప్‌ని పట్టుకున్నాడు.

మెల్లిగా అతడి శరీరం మరికొంత పాకింది. రెండో చేత్తో పైప్‌ని పట్టుకొని అతడు వెల్లకిలా తిరిగాడు. రెండు చేతుల్లోనూ పైప్‌ని పట్టుకొని అతడు పూర్తిగా లోపలకు చేరుకున్నాడు. అతడు మెల్లిగా నేలమీద అడుగుపెట్టాడు.

గదిలో గాఢాంధకారంగా వుంది. అతను టార్చిని ఆన్ చేశాడు. ఎదురుగావుంది గుమ్మం!

అతడు గుమ్మంవైపు నడిచాడు. తలుపును కొద్దిగా తోశాడు. కదిలింది.

తలుపునుతోసి అతడు లోపలికెళ్ళాడు. గదిలో యే చప్పుడూలేదు. గది నలువైపులా చూశాడు. గదిలో రైఫిల్స్, పిస్టల్స్, గ్రెనేడ్లు, మిషన్‌గన్స్ వగయిరా వున్నాయి. అతడు గుమ్మం వైపు కదిలాడు. తలుపును లాగాడు. ఆ వైపునుంచి తలుపుకు తాళంవేసి వుంటారని అతడు గ్రహించాడు.

నిమిషాలు గడిచిపోతున్నాయి. ఎడంవైపున మరో తలుపు అతడికి కనిపించింది. తలుపు తెర్చుకుని చీకటిగా

వున్న ఆ గదిలోకి వెళ్ళాడతను. క్షణకాలం నిశ్శబ్దంగా నిలబడ్డాడు.

ఆ గదిలో కూడా మనుషులు లేరని అతడు గ్రహించి టార్చి బటన్ నొక్కాడు. గదిలో నాలుగు స్టీల్ రాక్స్ వున్నాయి. రాక్స్‌నిండా విస్కీ, బ్రాండీ, రమ్, బీర్ బాటిల్సు వున్నాయి.

గదిలో టేబుల్సు, చుట్టూ కుర్చీలు వున్నాయి. ఒక టేబుల్ మీద రెండు గ్లాసులున్నాయి. అది బార్ రూమ్ కావచ్చు!

అతడా ఎదుటిగుమ్మం వైపు వెళ్ళాడు.

తలుపును లాగాడు. అటువైపు గదిలో జీరోవాట్ బల్బు వెల్లుతోంది. ఫోమ్ బెడ్ మీద ఎవరో పడుకుని గుర్రు పెడుతున్నాడు.

పిస్టల్ని చేత్తో పట్టుకుని అతను మంచందగ్గరకు వెళ్ళాడు. మంచం పక్కనున్న టీపాయి మీద పైప్ వుంది. నిద్రపోతున్నతడివంక అతడు పరీక్షగా చూశాడు.

సందేహంలేదు! నాగిన్ అతడే!

10

బులెట్ తన వాచ్ వైపు చూశాడు. అప్పుడే 25 నిముషాలు దొర్లిపోయాయి, అతడు గోడమీదున్న స్విచ్ ని నొక్కాడు. ఫ్లోరసెంట్ లైట్ వెలిగింది.

నాగిన్ యిటూ అటూ దొర్లి లేచి కూర్చున్నాడు. ఎదురుగావున్న బులెట్ వైపు చూసి అతడు కళ్ళు చిట్లించాడు.

“మిస్టర్ ఎవరు నువ్వు? పిస్టల్ తో వచ్చావు, ఏం కావాలి? డబ్బా?” అడిగాడు నాగిన్.

“లేచి నిలబడి చేతులెత్తు!” అన్నాడు బులెట్.

"నీతో నేను యుద్ధం చేయను. నీకు కావలసింది ఇచ్చి పంపిస్తాను" అన్నాడు నాగిన్.

"నాకు కావలసింది నువ్వు యివ్వలేవు!"

"అడిగి చూడు తెలుస్తుంది!" అన్నాడు నాగిన్ నవ్వుతూ.

"నువ్వు చంపించిన ఇండియన్ గూఢచారులు ముగ్గురూ నాకు కావాలి!" అన్నాడు బులెట్'

నాగిన్ పకపక నవ్వాడు. పరుపు కిటూ, అటూ దేని కోసమో అతను వెతుకుతున్నాడు.

"నీ పైప్ యిటువైపుంది! కదిలితే షూట్ చేస్తాను! డోంట్ మూవ్!" అర్చాడు బులెట్.

నాగిన్ పైప్ అందుకున్నాడు. వెలిగించి, పొగ పీల్చి నడుస్తూ బులెట్ వంక చూశాడు.

"మిస్టర్ ఆ గూఢచారులను నేను చంపించలేదు. వాళ్ళు తప్పులుచేసి ప్రాణాలను బలిచ్చుకున్నారు. పిండారిస్తాన్ గురించి వాళ్ళు రహస్యాలను సేకరిస్తున్నారు. మాకు దొరికారు. గూఢచారులను చంపడం న్యాయమేగా?"

"ఈ క్షణంలో నువ్వు నాకు దొరికావు. నిన్ను నేను చంపడం న్యాయమేగా?" అడిగాడు బులెట్.

నాగిన్ కిందకు దిగి నిలబడ్డాడు. పైజామా, స్లాక్‌లో వున్నాడతను. నోట్లో పైప్ వుంది.

"మిస్టర్ నువ్వు ఇండియన్‌లా వున్నావు. పక్కగదిలో బార్ వుంది. డ్రింక్స్ సేవిస్తూ మాట్లాడుదాం. మీ దేశంమీద నాకు శత్రుభావం లేదు. మీ గాంధీజీని గురించి నేను తల్చుకుంటూవుంటాను, ప్రతిరోజూ! గ్రేట్ మాన్! ఆ దేశం నుంచి వచ్చిన నువ్వు వా వైపు

పిస్టల్ గురిపెట్టడం విచిత్రంగా వుంది. కమాన్ మై ఫ్రెండ్, తాగుతూ మాట్లాడుదాం'' అన్నాడు నాగిన్.

''మిస్టర్ నాగిన్, నేనిక్కడకు డ్రింక్స్ కోసం రాలేదు. నా కసి తీర్చుకోడానికి వచ్చాను.''

''నన్ను చంపితే కసి తీరుతుందా?''

''కొంతవరకు!'' అన్నాడు బులెట్.

నాగిన్ తీయగా నవ్వాడు.

బులెట్ వైపు అతడు కదులుతున్నాడు.

''కదలకు కదిలేచస్తావు!''

''నీకేం కావాలో చెప్పు!''

''ఇండియన్ గూఢచారులను ఎత్తుకుపోయి చంపడం మానాలి?''

''అంతేనా! ఇటుపైన ఇండియన్ గూఢచారులెయీ దేశంలో మామూలంగా చావరు. మరెవరేనా చంపితే బాధ్యత నాది కాదు. నేను నీకు హామీ యిస్తున్నాను.''

''నిన్ను పైలోకానికి పంపేస్తే మా వాళ్ళకు యే ప్రమాదమూ యిటుపైన వుండదు!'' అన్నాడు బులెట్.

''మిస్టర్, నేను హార్ట్ పేషెంటుని. రేపో, మాపో ఎలాగూ చస్తాను. నన్ను చంపడం నీకు లాభించదు. మరొకడు నా పదవిలోకి వస్తాడు. అతడు చాలా నీకు హామీ యియ్యకపోవచ్చు! నువ్వు యువకుడివి! నామాట మీద నేను నిలబడతాను,'' అన్నాడు నాగిన్.

''నిన్ను నమ్ముతున్నాను. బార్ రూంలోకి పద!'' అన్నాడు బులెట్.

ముందుగా నాగిన్ బార్ రూంవేపు వెళ్ళాడు. లోపలకు ప్రవేశించాడు. లైటు వెలిగించి, లైటు పక్కనున్న మరో బటన్‌ని అతడు నొక్కాడు.

గదిలోకొచ్చిన బులెట్ అతడివైపు సూటిగా చూశాడు.

"ఆ బటన్ ఎందుకు నొక్కావు?" అడిగాడు బులెట్.

"లైట్ స్విచ్ పక్కనే వుంది. పొరబాటున నొక్కాను. లెటస్ సెలిబ్రేట్!" అన్నాడు నాగిన్.

రెండు గ్లాసుల్లో విస్కీపోసి, సోడా కలిపాడతను, తలుపులు తెరిచిన చప్పుడయింది. ఇరవయిమంది గుమ్మం లోంచి లోపలకు వస్తున్నారు.

బులెట్ మూడుసార్లు ట్రిగర్ నొక్కాడు. ఇరవయి మంది వెనక్కి పరిగెత్తారు. నాగిన్ వేపు చూశాడు బులెట్. అతడి చేతుల్ని వెనక్కిలాగి బిగించి తన ఎడం చేత్తో పట్టుకున్నాడు.

"యూ డర్టీ స్కంక్!" అని అతడి తలమీద పిస్టల్ పిడిలో తట్టాడు.

"ప్లీజ్, నన్ను చంపకు!" అన్నాడు నాగిన్.

"నిన్ను చంపను! నేనిక్కడనుంచి బయటకెళ్ళాలి! నువ్వు నాముందు నడువు! నీవెనక నేనొస్తాను" అన్నాడు బులెట్.

నాగిన్ మెల్లగా బయటకు కదిలాడు. నడవలో ఇరవయిమంది వున్నారు.

"వాళ్ళను పొమ్మను!" అరిచాడు బులెట్.

"ఫ్రెండ్స్, మీరు దూరంగాపొండి! మీరు ఏదేనా చేస్తే నేను చస్తాను" అన్నాడు నాగిన్.

వాళ్ళు దూరంగా కదిలారు. నడవ మధ్యలో మెట్లు వున్నాయి. నాగిన్, వెనకనే బులెట్ మెట్లమ్మట కిందకు దిగాడు. అన్ని లైట్లూ వెలుగుతున్నాయి.

ముందు గుమ్మంలోంచి వాళ్ళు బయటకు చేరుకున్నారు.

దూరంగా గేటు కనిపిస్తోంది. వాచ్‌మన్ పచార్లు చేస్తున్నాడు.

నాగిన్ మెల్లిగా చెట్లమధ్యనుంచి ప్రహరీగోడ దగ్గరకు వెళ్ళాడు. వెనకనే వున్నాడు బులెట్. ఇరవయిమంది ఆయుధాలతో దూరంగా వున్నారు.

"వాళ్ళను భవనంలోకి పొమ్మను!" అన్నాడు బులెట్.

"భవనంలోకి పొండి," ఆర్డరిచ్చాడు నాగిన్.

ఇరవైమందీ వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. బులెట్ పళ్ళు పటపట కొరికాడు.

"నువ్వు గాంధీజీ భక్తుడవుగా! ఆయన దగ్గరకు నిన్ను పంపిస్తున్నా" అన్నాడు బులెట్.

"నన్ను చంపకు, ప్లీజ్!" అన్నాడు నాగిన్.

"నిన్ను నమ్మలేను. నన్ను డ్రింక్స్‌కి రమ్మని బటన్ నొక్కి నీ అనుచరులను రప్పించావు! నీలాంటి పిశాచాలు జీవించివుండకూడదు!"

రెండుసార్లు ట్రిగ్గర్ నొక్కాడు బులెట్. నాగిన్ అరుస్తూ నేలమీద కూలిపోయాడు. టార్చికాంతిలో అతనివైపు చూశాడు.

నాగిన్ రక్తంమడుగులో వున్నాడు. సైప్ పక్కనే పడుంది.

బులెట్ ప్రహరీగోడ ఎక్కి అటువైపుకు దూకాడు. గబగబా రోడ్డువైపు నడిచి తన కారుదగ్గరకు చేరుకునాడు.

రాజన్ పరుగెత్తుకొచ్చాడు.

"ఏమైంది?" అడిగాడు రాజన్.

"ఇక్కడ నుంచి వెంటనే పారిపోదాం, పద!" అన్నాడు బులెట్.

ప్లిమత్ కారు రోడ్డుమ్మట దూసుకుపోయింది. వెనకనే రాజన్ మోరిస్ కారులో వెంబడించాడు.

హోటల్ హిమాలయా కాంపౌండులో రెండు కార్లూ ఆగాయి. లోపలకెళ్ళి బులెట్ తన ఏర్ బాగ్ తో తిరిగి వచ్చాడు. మోరిస్ కారులో కూర్చుని అతడు తలుపు మూశాడు.

"తొందరగా ఏర్ పోర్ట్ కి పద!" అన్నాడు బులెట్.

రాజన్ మోరిస్ కార్ని వేగంగా ఏర్ పోర్ట్ వైపు పోనిచ్చాడు.

దూరంలో ఏర్ పోర్ట్ లైట్లు కనిపిస్తున్నాయి. జరిగినదంతా బులెట్ తన మిత్రుడికి చెప్పాడు.

"మిస్టర్ రాజన్, మురం పిరికిపందలంతామని వాళ్ళకు ప్రదర్శించాను. ఇటుపైన వాళ్ళు ఇండియన్స్ దగ్గరకు రాదు!" అన్నాడు బులెట్.

"నా మీద వాళ్ళు కసి తీర్చుకుంటారు!" అన్నాడు రాజన్.

"మీ మీద వాళ్ళకు కసి ఏర్పడదు! నాగిన్, చెంగీజ్ లాటి దుర్మార్గులు పోయినందుకు ఎవ్వరూ విచారించరు. వాళ్ళను గురించి లోకం మర్చిపోతుంది. నాగిన్ స్థానంలోకి వచ్చే కొత్తవ్యక్తి ఇండియన్సను భయంతో చూస్తాడు," అన్నాడు బులెట్.

ఏర్ పోర్ట్ లో కారాగింది.

"ఇప్పుడు ఇండియాకు వెళ్ళే విమానం లేదు," అన్నాడు రాజన్.

"ఇది రగడా దేశం. డబ్బిస్తే యిక్కడ ఏదైనా దొరుకుతుంది. స్పెషల్ చార్టర్ ప్లేనులో ఇండియాకు పోతాను," అన్నాడు బులెట్.

"యూ ఆర్ రైట్! పోలీసులకు ఏదేనా తెలిసేలోగా నువ్వు యీ దేశం నుంచి పోవడం మంచిది," అన్నాడు రాజన్.

మరోగంటలో స్పెషల్ చార్టర్ ప్లేన్ రన్ వేమీద పరుగెత్తుతూ పైకిలేచింది. వరండాలో నిలబడి రాజన్ ప్లేన్ లైట్లవైపు చూశాడు.

కొంతసేపయ్యాక లైట్లు దూరంలో మాయమయ్యాయి. రాజన్ ధైర్యంగా తన మోరిస్ కారువైపు అడుగులు వేశాడు.

—:ఐపోయింది:—